www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -118 బుధవారం 12 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# అంతర్జాతీయ దృష్టి ఆకర్షించేలా సమ్మిట్

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎంఆదేశం
- గతేడాది సాధించిన పురోగతిపై నివేదిక కోరిన సీఎం
- వ్యాపార ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక
- హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్ష
- రద్దీకి అనుగుణంగా కోచ్‌లు సమకూర్చుకోవాలని ఆదేశం



**హైదరాబాద్ ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు.గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో.




# పార్లమెంట్ బయట పోటాపోటీ నిరసనలు..

- అమిత్ షా వివరణకు ప్రతిపక్షం పట్టు
- మకర ద్వారం వద్ద ఎన్‌డీయే, విపక్షం నిరసనలు
- ఝార్ఖండ్ అంశంపై విపక్షాన్ని ఎన్‌డీయే నిలదీత
- అమిత్ షా సభకు రావాలని విపక్షాల డిమాండ్
- రాహుల్ గాంధీది ద్వంద్వ వైఖరి అంటూ బీజేపీ ఆరోపణలు
- ఢిల్లీలో పోలీసు చర్యపై షా వివరణకు విపక్షాల పట్టు
- ఇరు వర్గాలు వెనక్కి తగ్గకపోవడంతో ప్రతిష్ఠంభన




**న్యూఢిల్లీ ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

పార్లమెంట్ మకర ద్వారం వద్ద అధికార, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళనపై విపక్షం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ఎన్‌డీయే ఆరోపించింది.

మిగతా 2లో.

# 73 లక్షల ఓట్లు పోయినట్టే

## తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి..

- తెలంగాణలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు ప్రాథమిక అంచనా
- ఇప్పటి వరకు 2.64 కోట్ల ఎస్ఐఆర్ ఫామ్ ల డిజిటలైజేషన్ పూర్తి
- జాడ తెలియని ఓటర్ల సంఖ్య 11.25 లక్షలు



**హైదరాబాద్ ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

తెలంగాణ వ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ భారీ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా లెక్క తేల్చారు. సేకరించిన

మిగతా 2లో.

## జనగణమన తరహాలో వందేమాతరం చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



2లో.

# త్వరలో రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లు..

## ఫీల్డ్ ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- రూ.10, రూ.20 పాలిమర్ నోట్ల క్షేత్రస్థాయి ప్రయోగాలకు కేంద్రం ఆమోదం
- ప్రయోగాత్మకంగా వంద కోట్ల చొప్పున నోట్లను జారీ చేయనున్న ఆర్‌బీఐ
- ప్రస్తుతం ఉన్న కాగితపు నోట్లతో పాటే ఇవి కూడా చెలామణి
- కాగితపు నోట్ల కంటే ఎక్కువ కాలం మన్నడమే పాలిమర్ నోట్ల ప్రత్యేకత
- జారీకి పట్టే సమయం, ఖర్చుపై ఇంకా స్పష్టత లేదని వెల్లడి




2లో.

# సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి

- త్వరలోనే బండారం బయటపెడతాం
- సిఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు: కెటిఆర్

**హైదరాబాద్, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు.సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో




మిగతా 2లో.

# ఏపీలో సోషల్ మీడియా కార్యకర్తలకు కూటమి పార్టీల హెచ్చరిక

- మిత్రపక్ష నేతలను విమర్శిస్తున్న ఫేక్ అకౌంట్లపై కూటమి దృష్టి
- వ్యక్తిగత దూషణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ
- సంయమనం పాటిస్తూ.. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని సూచన



**అమరావతి ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

ఆంధ్రప్రదేశ్‌లోని అధికార ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు తమ సోషల్ మీడియా కార్యకర్తలకు, అభిమానులకు కీలక ఆదేశాలు జారీ చేశాయి. మిత్రపక్షాల నాయకులను గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు, విద్వేషపూరిత ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు

మిగతా 2లో.

## నిషేధిత భూములపై ప్రజలు

# ఆందోళన చెందొద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

నిషేధిత ఆస్తుల పిఓబి / 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని,
గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న

మిగతా 2లో.

# ఘోర రోడ్డు ప్రమాదం

- సంగారెడ్డి జిల్లాలో ఆటోను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి
- మరో ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**సంగారెడ్డి ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

సంగారెడ్డి జిల్లాలో రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 9మంది దుర్మరణం చెందారు. ఈ రెండు వేర్వేరు ప్రమాదాలు జిల్లాలో జరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలవగా..

మిగతా 2లో.



# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

- ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
- 1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం
- 2025 జనవరి 26 నుంచి కొత్తగా 16.32 లక్షల ఆహార భద్రత కార్డులు
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొదు
- : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి

మొదటిపేజీ తరువాయి

పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. మంగళవారంతెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెస్రాక్ట్ సంస్థ కి చైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

మొదటిపేజీ తరువాయి

చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఆక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది నిజమో కాదో అన్నది యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలోహైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లత్రో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

22ఎకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు,



ఆర్డీవోలు, తహాశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లక్రు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్‌బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు.

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదు, కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలి. పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలి. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహాశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి, గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వలన సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయి. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

# పార్లమెంట్ బయట పోటాపోటీ నిరసనలు..

మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకుంటోందని విమర్శించింది. మరోవైపు ఢిల్లీలో గత నెల విద్యార్థులపై పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో సమాధానం చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది.

ఎన్‌డీయే ఎంపీలు రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని నినాదాలు చేశారు. అమిత్ షా సమాధానంపై చర్చకు రావాలని, పారిపోవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఝార్ఖండ్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేసినా రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. ఝార్ఖండ్ ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న విషయాన్ని ప్రస్తావించారు.మరోవైపు కాంగ్రెస్ ఎంపీలు అమిత్ షా సభకు రావాలంటూ నినాదాలు చేశారు. జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై జరిగిన పోలీసు చర్యకు బాధ్యత ఎవరిదో హోంమంత్రి స్వయంగా వివరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెబుతున్నా.. అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాల్సిందేనని పట్టుబట్టారు.

ఝార్ఖండ్‌లో పరీక్షల్లో అవకతవకలను నిరసిస్తూ విద్యార్థులు రాంచీలో అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీలు, వాటర్ క్యానన్లు ప్రయోగించారు. దీనిపై రాహుల్ గాంధీ ఇప్పటికే స్పందించారు. విద్యార్థులపై బలప్రయోగం సరికాదని, శాంతియుత నిరసనకు వారికి హక్కు ఉందని అన్నారు. చర్చల ద్వారా సమస్య పరిష్కరించాలని ఝార్ఖండ్ ప్రభుత్వాన్ని కోరారు.

అయితే రాహుల్ గాంధీ విద్యార్థుల అంశాల్లో ఆచితూచి స్పందిస్తున్నారని బీజేపీ ఎంపీ దినేశ్ శర్మ ఆరోపించారు. ఝార్ఖండ్‌లో జరిగిన ఘటనపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా కూడా ఇదే అంశాన్ని లేవనెత్తారు. విద్యార్థులపై లాఠీచార్జికి ఎవరు ఆదేశించారో చెప్పాలని ప్రశ్నించారు. మరోవైపు అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వం స్పష్టం చేసింది. సభ సజావుగా జరిగేందుకు ప్రతిపక్షం సహకరించాలని కోరింది. అయినా ఇరు వర్గాలు తమ డిమాండ్లపై వెనక్కి తగ్గకపోవడంతో పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

**హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజావినికిడి):** తెలంగాణలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ పక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. ÷ూష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఆహార

భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి, వాటి ద్వారా 61,08,544 మంది లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. మాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్ధిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్ధిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుడి చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల కార్డులు?3.43 కోట్ల లబ్ధిదారులు?ఉచిత సన్నబియ్యం వంటి కీలక అంశాలతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతో పాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, సంగారెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు 33 జిల్లాల్లో జరిగే పంపిణీ కార్యక్రమాలను క్రమశిక్షణతో, పారదర్శకంగా, నిర్వహించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# జనగణమన తరహాలో వందేమాతరం

## చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ప్రజావినికిడి)**భారత జాతీయ గీతం 'జన గణ మన' తరహాలోనే 'వందేమాతరం'కు కూడా ఇకపై చట్టపరమైన రక్షణ లభించనుంది. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ బిల్లు'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 1971 నాటి బిల్లులోని సెక్షన్ 3ను సవరించడం ద్వారా 'వందేమాతరం'ను కూడా చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. జాతీయ గీతాన్ని అడ్డుకోవడం లేదా దాని గౌరవాన్ని భంగపరిచేలా వ్యవహరించడంపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే అదే స్థాయిలో వందేమాతరానికి ఇప్పటివరకు ప్రత్యేక రక్షణ లేదు. తాజా సవరణ వందేమాతరానికి కూడా చట్ట పరమైన రక్షణ కల్పించింది. ÷ొత్త చట్టం ప్రకారం 'వందేమాతరం' గానం జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా ఆ గానం చేస్తున్న సమూహానికి అంతరాయం కలిగించడం శిక్షార్హమైన నేరం. దీనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే సవరణ బిల్లును పార్లమెంట్ గత నెలలో ఆమోదించింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడంతో బిల్లు ఇప్పుడు అధికారిక చట్టంగా అమల్లోకి వచ్చింది.

# అంతర్జాతీయ దృష్టి ఆకర్శించేలా సమ్మిట్

మొదటిపేజీ తరువాయి

సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు.హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

# 73 లక్షల ఓట్లు పోయినట్టే

మొదటిపేజీ తరువాయి

సమాచారంలో ఇప్పటి వరకు దాదాపు 2.64 కోట్ల ఫారాలను డిజిటలైజేషన్ పూర్తి చేయగా, నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. అయితే ఈ నమోదు సరళిని గమనిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర ఓటర్ల జాబితా స్వరూపమే మారిపోనుందని స్పష్టమవుతోంది.

మరోవైపు, క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులకు సవాలుగా మారిన అనేక అంశాలు వెలుగుచూశాయి. మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను (21.70 శాతం) వివిధ కారణాల వల్ల సేకరించలేకపోయినట్లు అధికారులు 'అన్‌కలెక్టబుల్'గా వర్గీకరించారు. ఇందులో అత్యధికంగా 45.18 లక్షల మంది ఓటర్లు తమ నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించగా, 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు నమోదైంది. మరో 11.25 లక్షల మంది అసలు జాడ తేలక అడ్రస్ దొరకని స్థితిలో ఉండగా, 6.70 లక్షల మందికిపైగా ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ భారీ వ్యత్యాసాలు, వలసల గణాంకాల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఊహించని పెద్ద మార్పులు చోటుచేసుకోనున్నాయి.

# ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరంతా కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం హుమనాబాద్ నుంచి జహీరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ప్రతిరోజు కూలి పని కోసం జహీరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు కూలీలు వస్తూ ఉంటారు. ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. ఆయిల్ ట్యాంకర్ హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటకకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని రాజగిరికి చెందినవారిగా గుర్తించారు. సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోనే జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఓ కారు రోడ్డు డివైడర్ పైనుంచి అవతల వైపు ఎగిరి పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# త్వరలో రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లు..

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ప్రజావినికిడి)**

దేశంలో త్వరలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్‌లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీ చేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటుకు వెల్లడించారు.భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు 'ఆర్‌బీఐ చట్టం-1934'లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీ చేసే అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో వీటిని తీసుకురావడం లేదని, వాటితో పాటే ఈ కొత్త నోట్లు కూడా అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. అందువల్ల, వీటిని ఎప్పుడు ప్రవేశపెడతారు, దీనికి ఎంత ఖర్చవుతుంది అనే విషయాలపై ఇప్పుడే కచ్చితమైన వివరాలు చెప్పలేమని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే, కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# ఏపీలో సోషల్ మీడియా కార్యకర్తలకు కూటమి పార్టీల హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

తప్పవని సంయుక్తంగా హెచ్చరించాయి. ఈ మేరకు 'ఎన్డీఏ సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ' పేరుతో ఒక బహిరంగ ప్రకటనను విడుదల చేశాయి.గత కొంతకాలంగా కూటమి పార్టీల మద్దతుదారుల ముసుగులో కొన్ని నకిలీ ఖాతాలు సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నాయని, వీటి వెనుక వైసీపీ శ్రేణుల హస్తం ఉందని కూటమి నాయకత్వం గుర్తించింది. తెలుగుదేశం కార్యకర్తగా నటిస్తూ పవన్ కల్యాణ్‌పై, జనసేన అభిమాని ముసుగులో చంద్రబాబుపై విమర్శలు చేస్తూ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ప్రకటనలో వివరించారు. ఇటువంటి చర్యల వల్ల అసలైన కార్యకర్తలు ఆవేశానికి లోనై ఒకరినొకరు విమర్శించుకుంటూ, తద్వారా కూటమి ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా కుట్రలను తిప్పికొట్టేందుకు అసలైన కార్యకర్తలు, అభిమానులు అత్యంత సంయమనం పాటించాలని మూడు పార్టీల నాయకత్వం కోరింది. సోషల్ మీడియాలో ఏవైనా అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే, వెంటనే స్పందించకుండా సంబంధిత పార్టీల సమన్వయకర్తల దృష్టికి తీసుకురావాలని సూచించింది. ఇకపై మిత్రపక్షాలపై గానీ, నాయకులపై గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత దాడులు, మితిమీరిన విమర్శలు చేయరాదని స్పష్టం చేసింది. అంతర్గత విభేదాలకు తావివ్వకుండా కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశాయి. ప్రభుత్వ సానుకూల నిర్ణయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని, కూటమి ఐక్యతే రాష్ట్ర ప్రగతికి మూలమని ఈ సందర్భంగా స్పష్టం చేశాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 12 ఆగస్టు 2026

## చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జిపై అధికారుల పరిశీలన

### రైల్వే బ్రిడ్జ్ నిర్మాణం,రోడ్డు విస్తరణపై సమగ్ర పరిశీలన




**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం,రోడ్డు విస్తరణకు సంబంధించి రైల్వే అధికారులు, షాద్‌నగర్ మున్సిపల్ అధికారులు,ఆర్అండ్‌బీ అధికారులు,రెవెన్యూ శాఖ అధికారులు తదితర శాఖల అధికారులు స్థలాన్ని పరిశీలించారు.బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పనులు,రోడ్డు విస్తరణకు అవసరమైన చర్యలు,స్థల పరిస్థితులు తదితర అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.వివిధ శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన పనులపై అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం.చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రోడ్డు విస్తరణ పనులు త్వరి తగిన ప్రారంభమవుతాయి అనే అంశాలపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది.

# జీవో 641ను వెంటనే రద్దు చేయాలి

### ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తాం:

### బిఆర్ఎస్ సీనియర్ నేత వై.రవీందర్ యాదవ్

**కొత్తూరు,(ప్రజావినికిడి):**
గ్రామీణ ప్రాంతాలను కాలుష్య కోరల్లోకి నెట్టే విధంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడం సరికాదని బీఆర్ఎస్ సీనియర్ నేత వై.రవీందర్ యాదవ్ అన్నారు. ప్రజలకు ఉపాధి,అభివృద్ధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం..వారి ఆరోగ్యానికి ముప్పు కలిగించే నిర్ణయాలు తీసుకోవడం దురదృష్టకరమన్నారు. సిద్ధాపూర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో కొత్తూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా, నిరసన కార్యక్రమంలో రవీందర్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం



నిర్ణయం తీసుకున్న నాటి నుంచి సిద్ధాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు, గిరిజన తండాల వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి వనరుల కల్పన కోసం భూములను కేటాయిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా డంపింగ్ యార్డు ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు.
చెత్త డంపింగ్ యార్డు కారణంగా పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని జీవో నంబర్ 641ను రద్దు చేసే వరకు నిరసన కార్యక్రమాలు,ప్రజా ఉద్యమం కొనసాగుతాయని హెచ్చరించారు.డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జేఏసీ నేతలు చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యం,పర్యావరణ పరిరక్షణ,భవిష్యత్ తరాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకోవాలని రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు.

# సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు, బూర్గుల రైతు వేదికల లో అవగాహన సదస్సు..






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
మండలంలోని బూర్గుల రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యజమాన్య సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ మాట్లాడుతూ,
సేంద్రియ వ్యవసాయం అంటే రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి సహజ పద్ధతులతో పంటలు పండించడం అని రైతులకు ఈ క్రింది సూచనలు చేయడం జరిగింది.


**ప్రధాన లక్షణాలు**

పశువుల ఎరువు,వర్మీ కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు,జీవ ఎరువులు వాడతారు పురుగు నియంత్రణ వేప పిండి,గోమూత్రం కషాయం,పసుపువేపనూనె వంటి సహజ పద్ధతులు.నీరు చుక్కల నీటి పారుదల,వర్షపు నీటి సంరక్షణ
భూమి ఆరోగ్యం పంట మార్పిడి, అంతర పంటలు, పచ్చిరొట్ట వేయడం.

**సేంద్రియ వ్యవసాయం వల్ల లాభాలు**

రసాయనాలు లేని ఆహారం తినడం వలన,పోషకాలు అధికంగా ఉండి మంచి ఆరోగ్యం,అలాగే నేల సారవంతం పెరుగుతుంది, సూక్ష్మజీవులు బతుకుతాయి, పర్యావరణం కలుషితం తగ్గి నీరు,గాలి స్వచ్ఛంగా తయారవుతాయి తేనెటీగలు,పక్షులు పెరుగుతాయి,ఆదాయంమార్కెట్లో సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్,ధర ఎక్కువ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతు శిక్షణ సంస్థ వ్యవసాయ అధికారి రజియా సుల్తానా,ఏఈఓ లుకిరణ్మయి,రాంబాబు,ఆత్మ(ఏటీఎం)లురవీందర్,వెంకటేష్,కడియలకుంట సర్పంచ్ రాజు జునాయక్,కాశిరెడ్డి గూడా సర్పంచ్ రామలింగం గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
హయత్ నగర్ మండల కార్యాలయం ఆవరణలో ఉన్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం అమ్మవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్ దేవాలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అరుణ చేళేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి

**మహేశ్వరం, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**
ప్రశాంతి హిల్స్ డివిజన్ 58లోని నంది హిల్స్ కాలని లోని అరుణ చేళేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి
అనంతరం సామిడి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుబిక్షంగా ఉండాలని మంచి ఆరోగ్యంతో ప్రతి ఒక్కరు కలసి మెలసి మంచి వాతావరణాన్ని నెల కొలపాలని ఆ అరుణాచ్చేలశ్వరా స్వామి అశీసులు అందరికి ఉండాలని ఆదేవుణ్ణి వేడుకున్నానని తెపిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్,సెక్రటరీ చెంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్



నాయకులు తెలంగాణ రాష్ట్రా నాయకులు గుమ్మలా రవీందర్ రెడ్డి మట్ట సత్యనారాయణ రాష్ట్ర యూత్ సెక్రటరీ చరణ్ రెడ్డి సామిడి ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు దీక్షిత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులుసార్ల రవిప్రకాష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## చౌదరిగూడెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్,షూస్ హైజీన్ కిట్స్ పంపిణీ





**చౌదరి గూడ,(ప్రజావినికిడి):**మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతన స్కూల్ యూనిఫార్మ్,షూస్,హైజీన్ కిట్లను ఘనంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్,గ్రామ సర్పంచ్ శ్వేతా చంద్రబాబు,చౌదరిగుడం మండల తహసీల్దార్ జగదీష్,మండల విద్యాశాఖ అధికారి కిరణ్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ హజారలి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునిత,పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి)చైర్మన్ లక్ష్మి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదర్,ఉప సర్పంచ్ హాజర్ అలి,మాజీ వైస్ ఎంపీపీ యాజజ్, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్ మాట్లాడుతూ,
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఏ మాత్రం తక్కువ కాదు.విద్యార్థుల అభివృద్ధికి వారికి కావలసిన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంది అని పేర్కొన్నారు.
2026-27 బడ్జెట్ కేటాయించి ₹26,674 కోట్లు (మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో ఇది సుమారు 8.23% శాతం).ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను,
నిర్వహిస్తు ప్రభుత్వ బడులలో విద్యా ప్రమాణాలను పెంచడానికి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని కొనియాడారు.
విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, షూస్,పుస్తకాలు మరియు హైజీన్ కిట్స్ అందిస్తూ విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఇంకా ఏమైనా సమష్యలున్నా మా దృష్టికి వస్తే వాటిని తీర్చేబాధ్యత నేను తీసుకుంటాననిఅన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

## మండలస్థాయి ప్రజావాణి నిర్వహణ

### జీవో విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం




**హైదరాబాద్, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. ఆగస్టు 13వ తేదీన ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

## కొత్తూరు మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ..

### ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరేద్దాం దేశభక్తి చాటుదాం..

**కొత్తూరు,(ప్రజావినికిడి):** మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు అమడపురం రణధీర్ గౌడ్ ఆధ్వర్యంలో కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రణధీర్ గౌడ్ మాట్లాడుతూ" ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత కొన్ని సంవత్సరాలుగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశవ్యాప్తంగా జాతీయ స్ఫూర్తిని పెంపొందిస్తోందన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటుకోవడంతో పాటు, స్వాతంత్ర్య సమరయోధుల



త్యాగాలను స్మరించుకోవాలని కోరారు.వికసిత భారత్ లక్ష్య సాధనకు ప్రతి పౌరుడు అంకితభావంతో పనిచేయాలని,కొత్త తరాలకు జాతీయ భావన,జాతీయ స్ఫూర్తి, స్వాతంత్ర్య వీరుల చరిత్రను పరిచయం చేయాల్సిన బాధ్యత మనందరిదేనని అన్నారు.ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్ నగర్ బిజెపి ఇన్చార్జ్ అందే బాబయ్య,జిల్లా కోశాధికారి అమడపురం నరసింహ గౌడ్,దేపల్లి అశోక్ గౌడ్,షాద్ నగర్ నియోజకవర్గం కన్వీనర్ వంశీకృష్ణ ,బిజెపి కౌన్సిల్ నెంబర్ మంగలి రమేష్,బిజెపి సీనియర్ నాయకులు వేణుగోపాల్ చారి మరియు రాఘవేందర్ రెడ్డి పిట్టల శేఖర్ గౌడ్ కొత్తూరు మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కోసిగి మల్లేష్ ఉపాధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి ప్రభాకర్ చారి కార్యదర్శి శివకుమార్ నాయక్,బిజెపి నాయకులు అరవింద్,సందీప్ సింగ్,శ్రీశైలం అప్ప,గవర్నమెంట్ స్కూలు అలాగే కృష్ణవేణి,మాంటిస్సోరివిద్యార్థులు పాల్గొన్నారు.

# రామకృష్ణ మఠానికి విరాళం



**అంబర్ పేట్, (ప్రజావినికిడి):**
హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఉన్న రామకృష్ణ మఠానికి ఆనంద జ్యోతి హై స్కూల్ పూర్వ విద్యార్థులు కలసి శ్రీ కనిగిరి చంద్రశేఖర్ మాజీ డైరెక్టర్ జయంతి పురస్కరించుకొని నారాయణ సేవ (అన్నదానం) కోసం 16 వేల 102 రూపాయిలు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద జ్యోతి హై స్కూల్ పూర్వ విద్యార్థులు కే. విజయకుమార్, ఫర్జానా,క్రాంతి, అశ్విని, నరసింహమూర్తి, పవన్,శంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం బి.ఎన్.రెడ్డి డివిజన్‌లో ఘనంగా తిరంగయాత్ర




**ఎల్బీనగర్, (ప్రజావినికిడి):**
వనస్థలిపురం బి.ఎన్.రెడ్డి డివిజన్ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరంగయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, కాటం క్రాంతి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తిరంగయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, దేశభక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని,భారత్ మాతాకీ జై,వందే మాతరం వంటి దేశభక్తి నినాదాలతో తిరంగయాత్ర కొనసాగింది. దేశభక్తి,జాతీయ సమైక్యత, అఖండ భారత స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం బి.ఎన్.రెడ్డి డివిజన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు శ్రీ వనపల్లి శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ జిల్లా ప్రభారి అదేవిదంగా ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి,తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ మోదు లచ్చి రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి,నూటి శ్రీనివాస్, తడకమళ్ల విజయకుమార్, చిట్టిపోల్ రవికుమార్ శ్రీధర్ రావు,రవి శంకర్, ప్రేమనాథ్ భూపాల రెడ్డి పవన్ రెడ్డి శరత్ కుమార్ , సురేష్,మహేష్ రాష్ట్ర యువ మోర్చా నాయకులు భార్గవ్ తేజ సాయిరాం గౌడ్ చరణ్ చైతన్య గౌడ్,అభినందన్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు వివిధ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, త్రివర్ణ పతాకం భారతదేశ గౌరవానికి, స్వాతంత్ర్యానికి, ఐక్యతకు ప్రతీక అని, ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయడమే తిరంగయాత్ర ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, దేశ సమైక్యత మరియు సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# బోనాల ఉత్సవాలతో భక్తి పరవశమైన చౌదరిగుడ గ్రామం..

**బోనాల ఉత్సవాలు తెలంగాణ సాంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీకలు..- ఆధ్యాత్మికతతో సాగిన ఎల్లమ్మ బోనాల ఊరేగింపు..**

**అమ్మవారి చల్లని చూపులు గ్రామ ప్రజలపై ఉండాలని ప్రత్యేక పూజలు చేసిన యువకులు.. మహిళలు..**







**శంషాబాద్,(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగ హిందువుల సంస్కృతికి,సాంప్రదాయాలు,ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాసం చివరి రోజున చౌదరిగుడ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణంలో యువకుల, మహిళల,చిన్నారుల తరలిరాగా వైభవంగా సాగిన బోనాల ఉత్సవ యాత్ర,గ్రామ దేవతలు అయినా ఎల్లమ్మ,పోచమ్మ దేవతల అనుగ్రహం ఈ ప్రాంత ప్రజలందరిపై ఉండాలని శంషాబాద్ మండలంలోని చౌదరిగుడ గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ బోనాలను పురస్కరించుకొని గ్రామ యువకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలోని ఆడపడుచులు బంధువులతో కలిసి ఆధ్యాత్మిక, భక్తి శ్రద్ధలతో బోనాలను శిరస్సున ధరించి,గ్రామం, రాష్ట్రం,దేశం సుభిక్షంగా ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ,
పోతురాజు,శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి చేరుకుని,బోనలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మంచే బిక్షపతి,నడిగడ్డ నవీన్,కొమ్ము గోపాల్,అనంతుల రమేష్, మల్చలం సురేష్,శ్రీనివాస్, పెంటయ్య, శ్రీధర్,సంతోష్,వేణు, ధనరాజ్,సుధాకర్,మురళి,రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తీగల కృష్ణారెడ్డి విద్యా సంస్థల్లో డాక్టర్ తీగల హరినాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు





**మహేశ్వరం, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**
తీగల కృష్ణారెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ తీగల హరినాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు తీగల కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి సమక్షంలో పలువురు ప్రిన్సిపల్స్, విభాగాధిపతులుఅధ్యాపకులు, నియోజకవర్గానికి సంబంధించిన పలువురు సీనియర్ నాయకులు కేక్ కట్ చేసి డాక్టర్ తీగల హరినాథ్ రెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం, భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు డాక్టర్ జె.సునీత కుమారి,డాక్టర్ కె.సుకన్య ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సుమారు 350 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఈ సేవా కార్యక్రమాన్ని ఘనవిజయంగా నిలిపారు.
ఈ సందర్భంగా డాక్టర్ తీగల హరినాథ్ రెడ్డి తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే,రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగం, భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అభినందించారు. రక్తదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని,యువత ఇటువంటి సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొనాలని డాక్టర్ తీగల హరినాథ్ రెడ్డి పేర్కొన్నారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి అధికారులతో సమన్వయ సమావేశం

**లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు**

**ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉండాలి జీపీ సాప్ , జీపీడీపీ , బీపీడీపీ , డీపీడీపీ లను సమర్థవంతంగా రూపొందించాలి**

**జలశ్రీ కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత వనమహోత్సవం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి**

**అధికారులతో సమన్వయ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి**





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కేవలం ఒక శాఖ బాధ్యత కాదని,అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ కె.కిరణ్మయి అన్నారు. ప్రతి గ్రామానికి ఉన్న వాస్తవ అవసరాలను గుర్తించి,వివిధ శాఖల పథకాలు, నిధులు,మానవ వనరులను సమర్థవంతంగా అనుసంధానం చేసి ఫలితాలు సాధించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జలశ్రీ, జీపీ సాప్ , 202627 జీపీడీపీ , బీపీడీపీ , డీపీడీపీ , వనమహోత్సవం, పారిశుధ్యం, శాఖల కన్వర్జెన్స్ తదితర అంశాలను అదనపు కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామానికి ఒక స్పష్టమైన అభివృద్ధి దిశ ఉండాలి. ఏ గ్రామంలో ఏ సమస్య ఉంది, దానికి ఏ శాఖ ద్వారా పరిష్కారం చూపవచ్చు,ఏ పథకం కింద నిధులు సమకూర్చవచ్చు, ఎప్పుడు పని పూర్తి చేయవచ్చు అనే అంశాలపై అధికారులు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలి అని సూచించారు.
ప్రతి శాఖ తన కార్యక్రమాలను గ్రామ అభివృద్ధి ప్రణాళికతో అనుసంధానం చేయాలి
గ్రామ పంచాయతీ స్థాయిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఒక్కో శాఖకు పరిమితం కాకుండా, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల కార్యక్రమాలను ఒకే సమగ్ర ప్రణాళికలోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.
“ఒకే గ్రామంలో వివిధ శాఖలు వేర్వేరుగా పనులు చేపట్టకుండా, పరస్పరం సమాచారాన్ని పంచుకొని ఒకే లక్ష్యంతో పనిచేయాలి. ఒక శాఖకు ఉన్న వనరులను మరో శాఖ కార్యక్రమంతో అనుసంధానం చేసి,ప్రభుత్వ నిధులను గరిష్టంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాలి” అని అధికారులకు సూచించారు.
గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో నమోదు చేసి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించాలని అన్నారు.
జీపీ సాప్ ప్రతి గ్రామానికి అభివృద్ధి సమాచార పత్రంగా ఉండాలిప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే చోట అందుబాటులో ఉంచే విధంగా జీపీసాప్ గ్రామ పంచాయితీ సమగ్ర అభివృద్ధి ప్రణాలికాను రూపొందించాలని ఆదేశించారు. గ్రామంలోని జనాభా,మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్,విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమం,నీటి వనరులు, పర్యావరణం తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పొందుపరచాలని సూచించారు. ప్రతి గ్రామానికి ఒక సమగ్ర బుక్‌లెట్ ఉండాలి. ఆ గ్రామంలో ఏముంది,ఏమి అవసరం, ఇప్పటికే ఏ కార్యక్రమాలు అమలవుతున్నాయి,ఇంకా ఏ పనులు చేపట్టాలి అనే పూర్తి సమాచారం అధికారుల చేతిలో ఉండాలి. అదే గ్రామ అభివృద్ధికి ప్రాథమిక పత్రంగా ఉపయోగపడాలిఅని ఆమె తెలిపారు.
202627 జీపీడీపీ లో అన్ని శాఖల కార్యక్రమాలు ప్రతిబింబించాలి. 202627 సంవత్సరానికి రూపొందించే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లో అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల కార్యక్రమాలు, పథకాలు, నిధులను సమన్వయం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.
గ్రామ సభలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రజల అవసరాల ఆధారంగా ప్రాధాన్యతా పనులను గుర్తించి జీపీడీపీ లో చేర్చాలని సూచించారు. గ్రామ స్థాయి ప్రణాళిక మండల స్థాయి బీపీడీపీ, జిల్లా స్థాయి డీపీడీపీ తో అనుసంధానమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీపీడీపీ కేవలం ఒక పత్రంగా తయారై ఫైల్‌లో ఉండకూడదు. అందులో పేర్కొన్న పనులు భూమిపై కనిపించాలి. ప్రణాళిక నుంచి అమలు వరకు ప్రతి దశలో అధికారులు బాధ్యత వహించాలి. అని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

**జలశ్రీ కింద నీటి సంరక్షణకు ప్రాధాన్యత**

వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, గ్రామాల్లో నీటి లభ్యతను మెరుగుపరచడం కోసం జలశ్రీ కార్యక్రమం కింద ఫార్మ్ పాండ్స్, సోక్ పిట్స్, పెర్కొలేషన్ ట్యాంకులు తదితర నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు.
ప్రతి గ్రామంలో నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా పనులను చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ పథకాలు, నిధులను కన్వర్జెన్స్ విధానంలో వినియోగించాలని అన్నారు. వర్షపు నీటిలో ఒక్క చుక్క కూడా వృథా కాకుండా సంరక్షించే విధంగా గ్రామస్థాయిలో శాశ్వత నిర్మాణాలను ప్రోత్సహించాలి. నీటి సంరక్షణ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆస్తులుగా నిలిచేలా ప్రణాళిక రూపొందించాలి అని అధికారులకు సూచించారు.

**వనమహోత్సవంలో మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత**

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటడం మాత్రమే లక్ష్యంగా కాకుండా,వాటి సంరక్షణకు స్పష్టమైన బాధ్యతను సంబంధిత శాఖలకు అప్పగించాలని సూచించారు. నాటిన మొక్కలకు నీటి సదుపాయం, రక్షణ,నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి శాఖ తన పరిధిలో నాటిన మొక్కల వివరాలను నమోదు చేసుకొని,వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్**

సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మురుగు కాలువలు,నీటి నిల్వలు,చెత్త పేరుకుపోయే ప్రాంతాలు,ప్రజా ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు,తాగునీటి వనరుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పారిశుధ్యం అనేది కేవలం ఒక రోజు కార్యక్రమం కాకూడదు. గ్రామాల్లో నిరంతర పారిశుధ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామాలను నిర్మించాలి అని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులను ఆదేశించారు.

**క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా సమన్వయంతో పనిచేయాలి**

ప్రతి శాఖ తమకు కేటాయించిన కార్యక్రమాలను సమయపాలనతో పూర్తి చేయడంతో పాటు,ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని కన్వర్జెన్స్ ద్వారా గరిష్ట ఫలితాలు ప్రజలకు గరిష్ట ప్రయోజనం అనే లక్ష్యంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ కె.కిరణ్మయి సూచించారు. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.
ఈసమావేశంలో జెడ్ పి సి ఓ /డి ఆర్ డి ఓ, కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ , =&దీ,ఇరిగేషన్ శాఖల ఈ ఈ లు,డి డబ్ల్యు ఓ,సంక్షేమ శాఖల అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత,హరీష్, డి ఎం హెచ్ ఓ స్వర్ణకుమారి, ఎంపీడీవో లు, ఎంపీ ఓ లు, ఏపీవో లు, ఏపిఎం లు, ఐఎ.ఈ ఈ లు తదితర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

**మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎంఓయూ**



**హైదరాబాద్, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో భేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు. యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

**15-30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించేలా చర్యలు**

**జిల్లా మానిటరింగ్ కమిటీలలో రైతులను భాగస్వాములను చేయాలి**

**కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సరళీకృతం చేయాలి**

**రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతులకు మేలు కలిగేలా చూడాలి**

**పత్తి రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్లు**

**సీసీఐ అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**హైదరాబాద్, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

రాష్ట్రంలో రానున్న 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో హైద్రాబాద్ లో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, ఒకరిద్దరి కారణంగా మొత్తం వ్యవస్థలకు చెడ్డపేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 'మనం బతకాలంటే రైతు బతకాలి' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పనిచేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లి పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రకృతిపై ఆధారపడి పత్తి సాగు చేసే రైతులలో సన్న చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు పక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు పక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఈ సీజన్‌లో అటువంటి లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2026-27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. ఈ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన రైతుకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని ఆదేశించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోట్ఫీ÷ చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత సీజన్‌లో 122 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో వాటి సంఖ్యను 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్ కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే, సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులకు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి రాకను క్రమబద్ధీకరించాలని, అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకు అనుగుణంగా పొడిగించాలని చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. పాస్ కిసాన్ యాప్ లో స్లాట్స్ ఓపెన్ చేసే ముందు సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి, ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుట్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలని అన్నారు.

# పాస్‌పోర్ట్ సేవల్లో తీవ్ర అంతరాయం

**సర్వర్లు పనిచేయకపోవడంతో ప్రజల ఇబ్బంది**

**విజయవాడ, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

దేశవ్యాప్తంగా పాస్‌పోర్టు సేవల్లో అంతరాయం ఏర్పడింది. సర్వర్లు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతిలోని పాస్‌పోర్టు కార్యాలయాల్లో సర్వర్లు పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి అక్కడికి వచ్చిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విజయవాడలో పెద్ద ఎత్తున ప్రజలు ఉదయం నుంచీ పడిగాపులు కాస్తున్నారు. వీరిలో అత్యధికంగా విద్యార్థులు ఉన్నారు. కేటాయించిన స్లాట్ ప్రకారం వచ్చామని.. సాంకేతిక సమస్యపై అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ్టి అపాయింట్‌మెంట్లను మరో రోజుకు రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు.

-----

# మధుప్రసన్న మృతి కేసులో కీలక పరిణామం

**తల్లి ఫిర్యాదుతో హత్యకేసు నమోదు**

**రాజమహేంద్రవరం, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**నగరంలో శాంతినగర్‌కు చెందిన యువతి మధుప్రసన్న మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమ కుమార్తెను దారుణంగా హత్య చేశారని ఆమె తల్లి జ్యోతి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోటిలింగాలపేటకు చెందిన అభిలాష్ సర్జికల్ బ్లేడుతో దాడి చేసి చంపాడని అందులో పేర్కొన్నారు. మధుప్రసన్నకి జూన్ 21న మరో యువకుడితో నిశ్చితార్థం చేశాం. ఈనెల 27న వివాహం జరగాల్సి ఉంది. తననే పెళ్లి చేసుకోవాలని కొన్ని రోజులుగా అభిలాష్ వెంటపడుతున్నాడు. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటానని మధుప్రసన్న చెప్పడంతో కోపం పెంచుకున్నాడు. మాట్లాడుకుందామని మభ్యపెట్టి బైక్‌పై గామన్ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ బ్లేడుతో దాడి చేశాడు. మధుప్రసన్న తప్పించుకునే ప్రయత్నం చేసే క్రమంలోనే యువకుడి చేతిపై గాయమైనట్లు అనుమానముంది. తమ కుమార్తెను దారుణంగా చంపిన అభిలాష్‌ను కఠినంగా శిక్షించాలి' అని జ్యోతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు యువకుడిపై హత్య కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం యువతి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

--------------

# ఆ సంస్థతో సిఎం సోదరుడికి సంబంధం లేదు

**నిబంధనల మేరకే సంస్థకు భూ కేటాయింపులు**

**మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ**

**హైదరాబాద్, ఆగష్టు 11 (ప్రజావినికిడి)** టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం సోదరులకు భూ కేటాయింపులు చేశారంటూ ఆయన అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో శ్రీధర్‌బాబు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఎకరం రూ.90లక్షలకు ఇస్తే.. మేం రూ.కోటిన్నరకు ఇచ్చాం. బోర్డు డిసైడ్ చేసిన దానికంటే రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదు. 32 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకటి టెసరాట్ కంపెనీ. నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయి. ఆ సంస్థతో సీఎం రేవంత్ సోదరులకు సంబంధం లేదు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ఆయన ఆరోపణలు చేయడం.. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల సంస్థగా కేటీఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా? తక్కువ ధరకు ఎందుకు ఇచ్చారో కేటీఆర్ సమాధానం చెప్పాలి. మీడియాలో వస్తుందని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు. పీఎం ఏక్తామాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయి. పరిశ్రమలు రావొద్దనే హిడెన్ అజెండాతో కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. నా శాఖలో జరిగే ప్రతి నిర్ణయం నాకు తెలుసు. ఎవరో చెప్తే నేను పనిచేసే రకం కాదు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేశారు. అప్పుడు కేటీఆర్‌కు తప్పనిపించలేదా అని అన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కలలో మాటని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

# ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

**హైదరాబాద్, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 18వ తేదీ నుంచి పార్కు చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ఈ మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు.నిర్మాణ పనుల కారణంగా రహదారి వెడల్పు తగ్గడంతో పాటు వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వివరించారు. దీనివల్ల ఉభయ దిశల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అందుకే వన్-వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావడానికి ముందు నిర్వహించిన పైలట్ ట్రయల్స్ ద్వారా ప్రణాళికను మరింత మెరుగుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.నూతన విధానం అమలు కోసం పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో లేన్ మార్కింగ్, లేన్ ఛేంజర్లు, దిశను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 24 గంటల పాటు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అలాగే, నావిగేషన్ యాప్‌లను సైతం అప్‌డేట్ చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ మార్పులు చేస్తామని వెల్లడించారు.

నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ వన్-వే విధానం అమలులో ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక దిశలో వాహనాలు నడపవద్దని వారు సూచించారు.

# నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

**ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్, ఆగష్టు 11 (ప్రజావినికిడి)**

రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని,నిర్లక్ష్యాన్ని,పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి,పలువురు అధికారులు,నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అటు వైపు నిత్యం ప్రయాణించే వారికి ఏళ్ల తరబడి నరకప్రాయంగా మారిందని,అందుకోసమే 2026 దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చాం...మాట ప్రకారం చేసి తీరాల్సిందేనని సమీక్షలో మంత్రి పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పూర్తి జవాబుదారిగా వ్యవహరిస్తుందనీ,ఏళ్ల తరబడి అవస్థ పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని,అందుకు అనుగుణంగా అధికారులు మనసుపెట్టాలని ప్రత్యేకంగా కోరారు. మ్యాన్ పవర్ పెంచి..మూడు షిఫ్టుల్లో పనులు చేయాలనీ,రాత్రి వేళల్లో 11 నుండి ఉదయం 6గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలనీ మంత్రి ఆదేశించారు.కారిడార్ కింద 6.25కి.మీ బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయి పనుల పురోగతి



సమీక్షిస్తానని.. అందుకు తగ్గట్టుగా రోజువారీ వర్క్ ప్రోగ్రెస్ అధికారులు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ÷-రస్తుతం క్షేత్ర స్థాయిలో నడుస్తున్న పనులపై మంత్రి కూలంకషంగా చర్చించారు.. సైట్ లోని కచ్చితమైన వాస్తవ పరిస్థితులు చెప్పాలని మంత్రి అధికారులు,వర్క్ ఏజెన్సీని అడిగారు. ప్రస్తుతం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ 60? మేర పనులు పూర్తయ్యాయని మరో 40శాతం పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు,వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు. ఇరువైపుల లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలనీ మంత్రి సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిని మంత్రి ఆరా తీశారు..ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని,రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనుల వల్ల,వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదనీ నిర్మాణ సంస్థ సమీక్ష సందర్భంగా విజ్ఞప్తి చేసింది. 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం..ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఆలోచించాలని మంత్రి అన్నారు. వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.


నుల్లో మరింత వేగం పెంచాలని,మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది.

అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని ఆర్ అండ్ బి అధికారులు,వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎవరి కోసం ఆందోళనలు ?

**ఆగస్టు 11 (ప్రజావినికిడి)**
పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో దిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో



అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక
పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్‌సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్‌సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్‌సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

# ఆంక్షల వ్యసనంలో అమెరికా

### దౌత్య మార్గంలో విఫలంతో ఆంక్షల కొరడా
### ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ




**టెహ్రాన్, ఆగస్టు 11 (ప్రజావినికిడి)**:తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసు కోవడం సాధ్యం కాదని బఘాయీ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొనసాగిస్తే.. సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు. ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జీసీ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

# నేడు పలు దేశాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం


### భారత్‌లో కనిపించదని వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ప్రజావినికిడి)**ఆగస్టు 12వ తేదీ బుధవారం ఆషాఢ అమావాస్య ఒకటయితే ..ఇదే రోజు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. అయితే ఇది భారత్‌లో కనిపించదు. మొత్తం 55 దేశాల్లో సంపూర్ణంగా కనిపిస్తుంది. 33 దేశాల్లో పాక్షికంగా కనిపిస్తుంది. స్టేషన్ నోర్డ్, సఫ్జుర్, బోర్గార్నాస్ , రెక్జావిక్, కెప్లావ్క్, సాన్టాండర్, బిల్బావో, గిజోన్, ఒవిడో, విటోరియా గస్టీజ్, ఎ కొరువా, లుగో, లోగ్రో, బుర్గోస్, పోన్‌ఫెరాడా, జరాగో తదితర దేశాల్లో సంపూర్ణ సూర్యగ్రహం కనిపిస్తుంది. ఐరోపాలోని పలు ప్రాంతాలు, వాయువ్య ఆఫ్రికా, ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాల్లో పాక్షికంగా గ్రహణం కనిపిస్తుంది. ఈ గ్రహణం అసాధారణమైనదని ఐరోపాలోని ఖగోళ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. స్పెయిన్‌తో సహా ఐరోపా ఖండంలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యాస్తమయానికి దగ్గరగా ఈ గ్రహణం సంభవిస్తుంది. దీని వల్ల సాయంకాలం ఆకాశంలో సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. అయితే ఈ గ్రహణాన్ని వీక్షించే వారు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. గ్రహణం పట్టిన సూర్యుడిని నేరుగా చూడటం వల్ల కంటికి నష్టం జరిగే అవకాశం అధికంగా ఉంటుంది. భారత్‌లో ఈ సూర్యగ్రహణం కనిపించదు. అలాగే దీఇనికి సంబంధించి ఎలాంటి ఆందోళనా వలదని అంటున్నారు. భారత్‌లో 2034, మార్చి 20న సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. ఇది ఆసియా అంతటా కొనసాగే ముందు భారత్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో కనిపించనుంది.

# కొత్త యూట్యూబర్లకు కష్టకాలం

### మానిటైజేషన్ వాచ్‌టైమ్‌ను పెంపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ప్రజావినికిడి)**



కొత్త యూట్యూబర్లకు కష్టకాలం వచ్చింది. మానిటైజేషన్‌కు అవసరమైన వాచ్‌టైమ్‌ను ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్ రెట్టింపు చేసింది. క్రియేటర్లు వీడియోల ద్వారా డబ్బు సంపాదించడానికి వీలు కల్పించే యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్‌లో చేపట్టిన మార్పుల్లో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు యూట్యూబ్ బ్లాగ్‌పోస్ట్ వెల్లడించింది. ఇంతకు ముందు.. డబ్బు సంపాదించాలంటే కంటెంట్ క్రియేటర్లు గత 365 రోజుల్లో 4,000 వాచ్ అవర్స్ లేదా 10 మిలియన్ షార్ట్స్ వ్యూస్ ఉండాలి. అయితే.. కొత్త నిబంధనల ప్రకారం గత 365 రోజుల్లో 8,000 వాచ్ అవర్స్ లేదా గత 90 రోజుల్లో 20 మిలియన్ల షార్ట్స్ వీక్షణలు ఉండాలి. 1,000 మంది సబ్‌స్క్రైబర్‌లు ఉండాలనే నియమంలో మాత్రం ఎటువంటి మార్పు లేదని తెలిపింది. అయితే ఇప్పటికే యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ లో ఉన్న క్రియేటర్లపై ఈ ప్రభావం ఉండబోదని పేర్కొంది. ప్రోగ్రామ్‌లో ఇప్పటికే 3 మిలియన్లకు పైగా కంటెంట్ క్రియేటర్లు ఉన్నారు. ఈ నిబంధనలు 2027 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు యూట్యూబ్ వెల్లడించింది. యూట్యూబ్ షార్ట్స్ ద్వారా వచ్చే ఆదాయం కోసం కూడా ఈ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం కొత్త నిబంధన ప్రవేశపెట్టింది. షార్ట్స్‌పై వచ్చే ప్రకటనలు, సబ్‌స్క్రిప్షన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచుకోవడానికి అర్హత పొందాలంటే క్రియేటర్లు 90రోజుల వ్యవధిలో 10 మిలియన్ల షార్ట్స్ వ్యూస్ కలిగి ఉండాలి. ఈ నిబంధన కొత్త క్రియోటర్లతో పాటు ఇప్పటికే ఉన్నవారికి కూడా వర్తిస్తుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1నుంచి ఇది అమల్లోకి వస్తుంది. యూట్యూబ్ ప్రీమియం అందుబాటులో ఉన్న అన్ని దేశాలకు ఈ ప్లాట్‌ఫామ్ ప్రీమియం లైట్ సేవలను విస్తరించింది. ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా అందులోని కంటెంట్‌ను నిరంతరాయంగా చూడొచ్చు. ప్రీమియం లైట్ సేవలు భారత్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. దీని ధర నెలకు రూ.89 కాగా, స్టాండర్డ్ ప్లాన్ ధర రూ. 149. దీనివల్ల క్రియేటర్లు అధిక ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని పేర్కొంది. యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రొగ్రామ్‌లో 2018 తర్వాత తొలిసారిగా భారీ మార్పులు చేయనున్నట్లు యూట్యూబ్ ప్రకటించింది. ఎ÷-లాట్‌ఫామ్‌లో క్రియేటర్ల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో మానిటైజేషన్ నిబంధనలను కంపెనీ మరింత కఠినతరం చేసింది. షార్ట్స్, ప్రకటనలు, ప్రీమియం ఆదాయ భాగస్వామ్యానికి సంబంధించిన నిబంధనలను సవరించింది. యూట్యూబ్ షాపింగ్‌లో నిర్దిష్ట మైలురాళ్లు చేరిన వారికి బోనస్‌లు, బ్రాండ్ డీల్స్‌కు ప్రోత్సాహకాలు, ట్రెండింగ్ కంటెంట్ ప్రారంభించి అభివృద్ధి చేసే వారికి అదనపు ఆదాయ అవకాశాలు కల్పించనుంది. యూట్యూబ్ ప్రీమియం లైట్‌ను అందుబాటులో ఉన్న అన్ని దేశాలకు విస్తరించనున్నారు. ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ద్వారా వచ్చే నికర ఆదాయంలో 30 శాతం, ప్రీమియం లైట్ ద్వారా వచ్చే ఆదాయంలో 60 శాతం క్రియేటర్ల కోసం కేటాయిస్తారు. సభ్యులు చూసే సమయం, వీడియోల వ్యూస్ ఆధారంగా ఈ మొత్తాన్ని క్రియేటర్లకు పంపిణీ చేస్తారు. లాంగ్ ఫార్మ్ వీడియోలకు 55 శాతం, షార్ట్స్‌కు 45 శాతం రెవెన్యూ షేర్ లభిస్తుంది. అయితే యూట్యూబ్‌లో కొత్తగా మానిటైజేషన్ పొందాలనుకునే వారికి ఈ నిబంధనలు కాస్త సవాలుతో కూడుకున్నవే. ఇప్పటి వరకు ఉన్నదాని కంటే రెట్టింపు వాచ్‌టైమ్ సాధించడం అంత సులభమైన పని కాదు. కాబట్టి కేవలం వైరల్ కంటెంట్‌పై ఆధారపడకుండా ఒరిజినల్ కంటెంట్‌ను ఇస్తూ వ్యూస్ సాధించగలిగితే క్రియేటర్లకు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉంటుంది.

# రిపోర్టర్‌గా మారిన బాలికలు..

### వైరల్ దెబ్బకు దిగొచ్చి రోడ్డు బాగుచేసిన అధికారులు



**రాయ్‌గఢ్ ఆగస్టు 11 (ప్రజావినికిడి)**
రోడ్డుపై గుంతలు.. బురదతో నిత్యం ఇబ్బందులు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో మహారాష్ట్రలోని ముగ్గురు పాఠశాల విద్యార్థినులు వినూత్నంగా నిరసన తెలిపారు. చేతిలో మొబైల్ ఫోన్.. మైక్‌కు బదులుగా గొడుగు పట్టుకుని రోడ్డుపై 'న్యూస్ రిపోర్ట్' చేశారు. వారి వ్యంగ్య వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు స్పందించారు. చివరకు రోడ్డుకు మరమ్మతులు చేశారు.రాయ్‌గఢ్‌కు చెందిన నేహా ఘరే, జ్యోత్స్నా ముకానే, మాన్సీ పవార్ పదో తరగతి చదువుతున్నారు. ముగ్గురి వయసు 15 ఏళ్లు. వర్షాకాలం మొదలైనప్పటి నుంచి తమ పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. భారీ గుంతలు, బురదతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నేహా, జ్యోత్స్నా, మాన్సీ ఓ వినూత్న ఆలోచన చేశారు. నేహా రిపోర్టర్‌గా మారింది. గొడుగును మైక్‌లా పట్టుకుని జ్యోత్స్నను రోడ్డు పరిస్థితిపై ప్రశ్నించింది. మాన్సీ మొత్తం దృశ్యాలను మొబైల్‌లో చిత్రీకరించింది. గుంతలు, బురదను చూపిస్తూ వ్యంగ్యంగా రూపొందించిన ఈ వీడియో నెట్టింట విపరీతంగా వైరల్ అయింది.
వీడియో అధికారుల దృష్టికి వెళ్లడంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దీంతో బాలికలకు స్థానికుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబసభ్యులు, గ్రామస్థులు, రాజకీయ నాయకులు వారిని అభినందించారు. మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే కూడా బాలికలను కలవడానికి ఆసక్తి చూపించారు."మా కుమార్తెలు చేసిన పనికి గర్వంగా ఉంది. ఇలాంటి సమస్యలను ప్రభుత్వం గుర్తించాలి" అని నేహా తండ్రి ఆత్మారామ్ ఘరే తెలిపారు.

# ఇరాన్ నుంచి పొంచివున్న ముప్పు

### సైనిక విమానంలో ట్రంప్ రహస్య ప్రయాణం
### 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనం




**వాషింగ్టన్ ఆగస్టు 11 (ప్రజావినికిడి)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో టర్కీ పర్యటన ముగించుకుని తిరిగి వెళ్తున్నప్పుడు బ్రిటన్ కు అత్యంత రహస్యంగా ప్రయాణించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్ ' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికల భయంతో ఆయన అందరూ భావించినట్లు ఎయిర్‌ఫోర్స్ వన్‌లో కాకుండా మరో సైనిక విమానంలో రహస్యంగా ప్రయాణించారని ఆ కథనం పేర్కొన్నది. వివరాల్లోకి వెళ్తే.. టర్కీ రాజధాని అంకారాలో నాటో సదస్సు ముగిశాక ట్రంప్.. కెమెరాల ముందు పాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కారు. అయితే ఆ తర్వాత ఆయనను ఒక ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కు ద్వారా రహస్యంగా మరోచోట ఉన్న చిన్న సైనిక విమానం (ఎయిర్‌ఫోర్స్ సి-32ఏ) వద్దకు తరలించారు. ఆ విమానంలోనే ఆయన బ్రిటన్‌కు చేరుకున్నారని అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. ట్రంప్ ప్రయాణిస్తున్నట్లు అందరూ భావించిన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం కూడా కొన్ని నిమిషాల తేడాతో అక్కడికి చేరుకుంది. పాత జ్ఞాపకాల కోసం ఈ విమానంలో ప్రయాణిస్తున్నట్లు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేసినప్పటికీ అసలు కారణం ఇరాన్ నుంచి పొంచి ఉన్న భద్రతా ముప్పేనని స్పష్టమవుతోంది. ఈ కథనంపై వైట్‌హౌస్ స్పందిస్తూ.. 'అధ్యక్షుడిపై అమెరికా శత్రువులు కన్నేశారు. వారి నుంచి రక్షణ కల్పించడానికి మా వద్ద ఉన్న అన్ని మార్గాలను ఉపయోగిస్తాం' అని కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవ్ చుంగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈ రహస్య ప్రయాణంపై పెంటగన్ ఇంకా స్పందించలేదు.

# జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలి

## టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్




రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరిగే తొలి మ్యాచ్‌లో ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సూచించాడు. ధ్రువ్ జురెల్ కంటే కూడా సర్ఫరాజ్ ఖాన్‌కు స్పిన్ బౌలింగ్‌ను అలవోకగా ఆడుతాడని అభిప్రాయపడ్డాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటన వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం(ఆగస్ట్ 15) గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. ఇప్పటికే శ్రీలంకకు చేరి వామప్ మ్యాచ్ ఆడిన టీమిండియా ఈ సిరీస్ కోసం అన్ని విధాల సిద్ధమైంది. తొలి టెస్ట్ నేపథ్యంలో తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన కైఫ్.. తన తుది జట్టు అంచనాను వెల్లడించాడు. ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఎంచుకున్నాడు. 'సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ధ్రువ్ జురెల్‌కు తుది జట్టులో అవకాశం కల్పిస్తారేమో. అతను నిలకడగా రాణించనప్పటికీ.. జట్టులో భాగమని భావిస్తే మాత్రం సర్ఫరాజ్ ఖాన్‌కు నిరాశే ఎదురవుతుంది. అతను అవకాశం కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. కానీ నా అభిప్రాయం ప్రకారం ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలి. ఎందుకంటే.. ధ్రువ్ జురెల్ కంటే సర్ఫరాజ్ ఖాన్ స్పిన్ బాగా ఆడుతాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో పిచ్ కండిషన్స్ అర్థమయ్యే కొద్దీ సర్ఫరాజ్ ఖాన్ రకరకాల షాట్స్ ఆడుతూ తనదైన శైలిలో బ్యాటింగ్‌ను కొనసాగించగలడు. ముఖ్యంగా ఉపఖండపు పిచ్‌ల్లో ఆట నాలుగో లేదా ఐదో రోజు వచ్చేసరికి పరిస్థితులు పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా మారిపోతాయి. ఇలాంటి కండిషన్స్‌లో బ్యాటింగ్ చేయడం కష్టంగా మారుతుంది. అప్పుడు సర్ఫరాజ్ ఖాన్ జట్టుకు బాగా ఉపయోగపడగలడు. అతను స్వీప్, రివర్స్ స్వీప్, ఎక్స్‌ట్రా కవర్స్, బ్యాక్‌ఫుట్ ఇలా ఏ షాటైనా స్పిన్ బౌలింగ్‌లో ఆడగలడు. మరోవైపు జురెల్ ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. వామప్ మ్యాచ్‌లోనూ అతను రెండు ఇన్నింగ్స్‌ల్లో 18 పరుగులు మాత్రమే చేశాడు.'అని కైఫ్ చెప్పుకొచ్చాడు. తన జట్టులో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్‌లను ఓపెనర్‌గా ఎంపిక చేసిన కైఫ్.. దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌లతో పాటు సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజాలను మిడిలార్డర్ బ్యాటర్లుగా ఎంచుకున్నాడు. మానవ్ సుతార్, సారాన్ష్ జైన్‌లో ఒకరికి అవకాశం దక్కుతుందని, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ స్పెషలిస్ట్ బౌలర్లుగా బరిలోకి దిగుతాడని అంచనా వేసాడు.

# కోహ్లీపై మాజీ ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ ప్రశంసల జల్లు

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ జట్టులో ఉంటే ఆటగాళ్లందరికీ పునకాలేనని చెప్పాడు. సహచర ఆటగాళ్లపై కోహ్లీ ప్రభావం తీవ్రంగా ఉంటుందని చెప్పాడు. అతని కారణంగా చుట్టూ ఉన్న ఆటగాళ్లు కూడా మైదానంలో మరింత ఎఫెర్ట్ పెడుతారని తెలిపాడు. బ్యాటింగ్‌లోనే కాకుండా ఫీల్డింగ్‌లోనూ కోహ్లీ తోపేనని చెప్పాడు. టీమిండియా ఫీల్డింగ్ కోచ్ బాధ్యతల నుంచి టీ దిలీప్ ఇటీవలే తప్పుకున్న సంగతి తెలిసిందే. విరాట్ కోహ్లీ సారథ్యంలోనే 2021లో ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన టీ దిలీప్ ఐదేళ్లు సేవలందించాడు. ఇంగ్లండ్ టూర్ అనంతరం అతని కాంట్రాక్ట్‌ను పొడిగించేందుకు బీసీసీఐ నిరాకరించింది. దాంతో టీ దిలీప్‌కు ఉద్వాసన తప్పలేదు. తాజాగా జియోస్టార్ షోలో మాట్లాడిన టీ దిలీప్.. కోహ్లీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్ ఆడుతున్నా.. ట్రైనింగ్ సెషెన్స్‌లో పాల్గొన్నా ఒకే ఇంటెంట్ చూపిస్తాడని తెలిపాడు. ట్రైనింగ్ సెషన్స్‌లో కూడా డైవ్ చేస్తూ బంతులను అడ్డుకుంటాడని దిలీప్ వెల్లడించాడు. 'విరాట్ కోహ్లీ.. ఇంటెన్సిటీ విషయంలో ఏ మాత్రం రాజీపడడు. పవర్‌ప్లేలో అతని ఆట తీరును మీరు చూసే ఉంటారు. బ్యాటర్‌గా అతను ఎలా ఉంటాడో.. కవర్ లేదా షార్ట్ మిడ్ వికెట్‌లో అతను ఫీల్డింగ్ చేసే తీరు కూడా అద్భుతంగా ఉంటుంది. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లోనూ విరాట్ కోహ్లీ చాలా చురుకుగా డైవ్స్ చేస్తూ ఫీల్డింగ్ చేశాడు. తన ఆటతీరుతో ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకొస్తాడు. కెరీర్ చివరి దశలో ఉన్నా కూడా డెత్ ఓవర్లలో మైదానం చుట్టూ పరుగెడుతాడు. సర్కిల్ బయటకు ఫీల్డింగ్ విస్తరించినప్పుడు పరుగెత్తే తొలి ఆటగాడు అతనే. జట్టు కోసం అతను చూపించే ఇంటెండ్ అమోఘం. మైదానంలో అతని ప్రవర్తన నన్ను విపరీతంగా ఆకట్టుకుంటుంది. బంతి దగ్గరగా ఉన్నప్పుడే కాకుండా దూరంగా ఉన్నప్పుడు కూడా రియాక్ట్ అవుతుంటాడు. బంతి ఎప్పుడూ తన చేతుల్లోనే ఉండాలని కోరుకుంటాడు. విరాట్ కోహ్లీ ఆట తీరు.. ప్రాక్టీస్ సెషన్స్, మ్యాచ్‌ల్లోనూ ఒకేలా ఉంటుంది. అతనితో కలిసి ఆడుతున్నప్పుడు ఇతర ఆటగాళ్లు కూడా ప్రభావితమవుతారు. మైదానంలో మరింత ఎఫెర్ట్ పెట్టే ప్రయత్నం చేస్తారు. జట్టులో విరాట్ కోహ్లీ తీసుకువ్చే ప్రభావం అలాంటిది.'అని దిలీప్ కొనియాడాడు.






# పంత్‌కు అండగా మహమ్మద్ కైఫ్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అండగా నిలిచాడు. ప్రస్తుతం రిషభ్ పంత్ గడ్డు కాలం ఎదుర్కొంటున్నాడని, భారత టీ20, వన్డే జట్లలో చోటు కోల్పోయాడని తెలిపాడు. కానీ టెస్ట్‌ల్లో రిషభ్ పంత్‌కు తిరుగులేదని, శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో పంత్ రాణిస్తాడని కైఫ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. రెండేళ్ల క్రితం భారత్ తరఫున చివరి అంతర్జాతీయ వైట్ బాల్ మ్యాచ్ ఆడిన రిషభ్ పంత్.. వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో దారుణంగా విఫలమయ్యాడు. రూ.27 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్ ట్యాగ్ రిషభ్ పంత్‌పై అనవసర ఒత్తిడిని తీసుకొచ్చింది. రిషభ్ పంత్ వైఫల్యంతో లక్నో సూపర్ జెయింట్స్ రెండు సీజన్లలో పేలవ ప్రదర్శన కనబర్చింది. దాంతో ఆ జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి రిషభ్ పంత్ తప్పుకున్నాడు. వైట్ బాల్ క్రికెట్‌లో విఫలమైనా రెడ్ బాల్ క్రికెట్‌లో పర్వాలేదనిపించాడు. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు రిషభ్ పంత్ గురించి మాట్లాడిన కైఫ్.. ఇప్పటికీ సుదీర్ఘ ఫార్మాట్‌లో అతను గొప్ప ఆటగాడేనని అభిప్రాయపడ్డాడు. అయితే తనపై నిరంతరం ప్రతికూల వార్తలు వస్తుండటం వల్ల 28 ఏళ్ల రిషభ్ పంత్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడని తెలిపాడు. అతనికి జట్టు మద్దతుగా నిలవాలని కోరాడు.'రిషభ్ పంత్‌ను ఇతర ఫార్మాట్లకు పరిగణనలోకి తీసుకోవడం లేదు. అతను వన్డేలు ఆడి చాలా రోజులు అయ్యింది. టీ20ల్లో అతని పేరును కూడా పరిశీలించడం లేదు. ఐపీఎల్‌లో కూడా అతను గడ్డు కాలం ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం అతని గాశారం ఏ మాత్రం బాలేదు. కానీ టెస్ట్ క్రికెట్‌లో నేను అతన్ని కొంచెం భిన్నంగా చూస్తాను. టెస్ట్ మ్యాచ్‌ల్లో అతను ఏం చేయగలడో పరిగణనలోకి తీసుకొని మద్దతు ఇస్తాను. భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయమైన విజయాలు అందించిన పంత్.. అప్‌కమింగ్ రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ఎలా రాణిస్తాడో చూడాలనుకుంటున్నా. అతనిపై చాలా ఒత్తిడి ఉందని తెలుసు. మీడియాలో అతని పేరును సాకూలంగా ప్రస్తావించడం లేదు. అతని గురించి ప్రతికూల చర్చలే జరుగుతున్నాయి. అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డ్ సాధించిన విషయాన్ని పక్కన పెడితే.. అతని జట్టు దారుణంగా విఫలమై పాయింట్ల పట్టికలో వెనుకంజలో నిలిచింది. దాంతో జనాలు పంత్ గురించి ప్రతికూల చర్చలు చేశారు. కానీ టెస్ట్ క్రికెట్‌లో అతను ఎప్పటికీ గొప్ప ఆటగాడే.'అని కైఫ్ చెప్పుకొచ్చాడు. భారత్ తరఫున ఇప్పటి వరకు 50 టెస్ట్‌లు ఆడిన రిషభ్ పంత్ 43.37 సగటుతో 3557 పరుగులు చేశాడు. ఇందులో 19 హాఫ్ సెంచరీలతో పాటు 8 శతకాలు ఉన్నాయి.

# బంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) దిల్లీ క్యాపిటల్స్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్‌ను కోల్‌కతా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఓ వైద్య విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన అత్యాచారం, బెదిరింపులు, దాడి తదితర ఆరోపణల కేసులో అభిషేక్ పోరెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హుగ్లీ జిల్లా పరిధిలో నమోదైన ఆ కేసులో అభిషేక్ పోరెల్‌ను అరెస్ట్ చేయాలని ఇటీవల కలకత్తా హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. అయితే హుగ్లీ రూరల్ ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం, దమ్‌దమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమామి సిటీలో అభిషేక్ పోరెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరిచారు. ఆ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని గత జూన్‌లో హుగ్లీలోని మోగ్రా పోలీస్ స్టేషన్‌లో అభిషేక్ పోరెల్‌పై ఫిర్యాదు చేసింది. తనకు, అభిషేక్ పోరెల్‌కు సుమారు మూడు సంవత్సరాలుగా సంబంధం ఉందని ఆమె పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆరోపించింది. ఇద్దరం కలిసి విదేశాలకు కూడా వెళ్లినట్లు ఫిర్యాదులో తెలిపింది. అయితే గత ఏడాది నుంచి తమ మధ్య విభేదాలు మొదలయ్యాయని ఆమె పేర్కొంది. ఆ తర్వాత పోరెల్ తనకు దూరంగా ఉండటం ప్రారంభించాడని ఆరోపించింది. పెళ్లి చేసుకుంటానని గతంలో చెప్పినప్పటికీ ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవడానికి నిరాకరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అభిషేక్ పోరెల్ తనపై దాడి చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని వైద్య విద్యార్థిని ఆరోపించింది. అంతేకాకుండా తనను కొంతకాలం నిర్బంధించి, ఆహారం కూడా ఇవ్వకుండా ఒంటరిగా ఉంచాడని ఫిర్యాదులో పేర్కొంది. ఆ కారణంగా తాను శారీరకంగా బలహీనపడటంతో పాటు సరిగ్గా నడవలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. తనకు గాయాలు కావడంతో అత్యవసరంగా వైద్య చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని ఆమె ఆరోపించింది. ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లు ఉన్నప్పటికీ గాయాల కారణంగా వైద్య సహాయం పొందాల్సి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొంది. వైద్య విద్యార్థిని ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే అభిషేక్ పోరెల్ ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ వెంటనే అతడిని అదుపులోకి తీసుకోలేకపోయారు. దీంతో బాధితురాలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ఇటీవల కేసును పరిశీలించిన కలకత్తా హైకోర్టు, ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రికెటర్‌ను అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో పోలీసులు అభిషేక్ పోరెల్ కోసం గాలింపు చేపట్టారు. చివరకు దమ్‌దమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమామి సిటీలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ కేసులో అత్యాచారం, క్రిమినల్ బెదిరింపులు, దాడి, నిర్బంధం తదితర ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. తనపై వచ్చిన ఆరోపణలను అభిషేక్ పోరెల్ గతంలో ఖండించినట్లు సమాచారం.

# భువనేశ్వర్‌లో కాంటినెంటల్ టూర్

## ఈ నెల 22న 18 క్రీడాంశాల్లో పోటీలు

న్యూఢిల్లీ : భారత అథ్లెటిక్స్‌కు చిరునామాగా మారేందుకు భువనేశ్వర్ మరో అడుగు ముందుకేసింది. గత ఏడాది కళింగ స్టేడియంలో ఇండియన్ ఓపెన్ వరల్డ్ అథ్లెటిక్స్ బ్రాంజ్ లెవల్ టోర్నమెంట్ నిర్వహించగా.. తాజాగా వరల్డ్ అథ్లెటిక్స్ ఈ టోర్నమెంట్ స్థాయిని పెంచింది. దీంతో ఈ ఏడాది ఇక్కడ కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్ జరుగనుంది. స్థాయి పెరగటంతో ఇక్కడ పోటీపడిన అథ్లెట్లకు కేటగిరీ బీ పాయింట్లు దక్కనుండగా, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రభావం చూపుతుంది. ఈ నెల 22న జరుగనున్న కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌లో 18 క్రీడాంశాలకు వరల్డ్ అథ్లెటిక్స్ అనుమతి ఇచ్చింది. పురుషుల విభాగంలో 100మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 5000మీటర్లు, 110మీటర్ల హార్డిల్స్, హై జంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో ఉండనుం డగా.. మహిళల విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్లు, 1500 మీటర్లు, 5000మీటర్లు, 100 మీటర్ల హార్డిల్స్, హై జంప్, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో ఉండనున్నాయి. గత ఏడాది బ్రాంజ్ లెవల్ టోర్నమెంట్లో ప్రైజ్‌మనీ రూ.25 లక్షలు కాగా.. తాజాగా సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌కు ప్రైజ్‌మనీ రూ.75 లక్షలు ఇవ్వనున్నారు. 2028 ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌తో పాటు అదే ఏడాది ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు సైతం భువనేశ్వర్ వేదికగా నిలువనున్న సంగతి తెలిసిందే.



**బరిలో స్టార్ అథ్లెట్లు** భువనేశ్వర్ కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి అథ్లెట్లు పోటీపడనున్నారు. స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా డైమండ్ లీగ్‌లో ఆ నెల 21న పోటీపడనున్నాడు.

దీంతో అతడు ఈ ఈవెంట్‌లో పోటీపడటం లేదు. కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన మురళీ శ్రీశంకర్, యశ్ వీర్ సింగ్, గుల్వీర్ సింగ్, సీమా కలిరామా, సర్వేశ్‌లు ఇక్కడ పోటీపడనున్నారు. ప్రస్తుతం భారత అథ్లెటిక్స్ బృందం పొలాండ్‌లో శిక్షణ పొందుతుంది. అక్కడ్నుంచి నేరుగా భువనేశ్వర్‌కు చేరుకుని పోటీల్లో పాల్గొంటా రు.

# పళ్ల బురుసు సందేశాత్మక చిత్రం



'పళ్ళ బురుసు' లాంటి మంచి సందేశాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు నిర్మాత సుప్రియ యార్లగడ్డ. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్, గోమతి రెడ్డి ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రియ మాట్లాడుతూ.. ఏఎన్నార్ ఉండిఉంటే మంచి చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ప్రశంసించేవారని అన్నారు. 'అందరూ ఎంతో ప్రేమించి తీసిన సినిమా 'పళ్ళ బురుసు'. దీన్ని చూస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అదే సమయంలో కన్నీళ్లొచ్చాయి. మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా అనిపించిందని నాగార్జున అన్నారు. . ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై మరో నిర్మాత వివేక్ కృష్ణపాణితో కలిసి నిర్మించిన చిత్రమే 'పళ్ళ బురుసు'. అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్లు పూర్తి చేసుకుంది. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో చక్కటి సినిమాలు చేశాం. ఈ 50వ సంవత్సరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాం. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూషన్‌ని విస్తరించాం. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. తల్లిదండ్రుల్ని మనం చూసుకున్న దానికన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు. అది చాలా ముఖ్యం. అలా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకున్నా. ఇప్పటికీ అమల కూడా వాళ్ల అమ్మానాన్నల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇందులో శంభు తాతగా సుధాకర్ అద్భుతంగా చేశారు. తన కొడుకు పాత్రలో మురళీధర్ చక్కగా నటించారు. ఈ నెల 14న మా అమ్మ పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ చిత్రంపై ఉంటాయని నా నమ్మకం అన్నారు. కుటుంబంతో కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరి మనసుల్ని హత్తుకుంటుంది' అన్నారు దర్శకుడు ఉదయ్. ఈ కార్యక్రమంలో సుప్రియ యార్లగడ్డ, మురళీధర్ గౌడ్, సుధాకర్, గోమతి, పవన్ సీహెచ్, ప్రసాద్, సురేశ్ గంగుల, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

----




# మోహన్ లాల్ కుమార్తె విస్మయ

## తుడక్కం మూవీతో అరంగేట్రం

మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ . జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్‌లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ.2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ.6.63 కోట్ల) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# శబరిమలకు సంబంధం లేని ఇరుముడి

## దర్శకుడు శివ నిర్వాణ స్పష్టీకరణ




రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ ఫ్యామిలీ అండ్ డివోషనల్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా పాటల్లో, టీజర్‌లో రవితేజ అయ్యప్ప మాలలో కనిపించారు. దీంతో ఈ చిత్ర కథపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయి. శబరిమల బ్యాక్‌డ్రాప్‌లో ఇది రానుందని ప్రచారం మొదలైంది. తాజాగా దీనిపై దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. శబరిమల దేవాలయానికి ఈ సినిమాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కథకు శబరిమలతో ఎలాంటి సంబంధం లేదు. సినిమాలో కథానాయకుడి జీవితంలో 41 రోజుల అయ్యప్ప దీక్ష ఒక భాగం మాత్రమే. దీక్షా కాలంలో అయ్యప్ప భక్తులు తమ నియమావళి, అలవాట్ల విషయంలో చాలా నిష్టగా ఉంటారు. వ్యసనాలు ఉన్న ఒక వ్యక్తి ఈ దీక్ష తీసుకోవాల్సి వస్తే.. అతడు మద్యానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. అక్కడే కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. కఠినమైన నియమాలు ఉండాలి కాబట్టే నేను అయ్యప్ప స్వామి దీక్ష నేపథ్యాన్ని ఎంచుకున్నాను. అంతే తప్ప ఇది శబరిమలకు సంబంధించిన కథ కాదని ఆయన పేర్కొన్నారు ఈ 41 రోజుల కథే స్క్రీన్‌ప్లేకి ప్రధాన బలంగా నిలుస్తుంది. అది సినిమాను మరింత ఆసక్తికరంగా మారుస్తుంది. ఆ దీక్షకు ముందు ఏం జరిగింది.. దీక్షలో ఉన్న సమయంలో ఏం జరిగిందనే విషయాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయని శివ నిర్వాణ తెలిపారు. రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తున్న ఈ సినిమా ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది

-------

# రుక్మిణీ వసంత్ మలయాళ ఎంట్రీ..



ఒక్క సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నారు అంటే అది హీరోకైనా, హీరోయిన్ కైనా వరుసగా అవకాశాలు వచ్చి పడతాయి. అందులో భాగంగానే మరీ ముఖ్యంగా ఈ మధ్యకాలంలో యంగ్ హీరోయిన్స్ తమ అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అలాంటి వారిలో రుక్మిణి వసంత్ కూడా ఒకరు. సప్త సాగరాలు దాచేయెల్లో అనే సినిమాతో వెండితెరకు పరిచయమైన రుక్మిణీ వసంత్.. తెలుగులో తొలిసారి నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. అయితే ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందుకోలేదు. ఆ తర్వాత తమిళ్ లో శివ కార్తికేయన్ సరసన మదరాసి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా సక్సెస్ కాలేదు. అయితే ఈ సినిమా ప్రమోషన్స్ సమయంలో డైరెక్టర్ ఈమెకు ఇచ్చిన ఎలివేషన్ కారణంగా ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చింది రుక్మిణి వసంత్. సరైన క్యారెక్టర్ పడితే తనను తాను నిరూపించుకోవడానికి ఎప్పుడూ సిద్ధమే అని కాంతారా చాప్టర్ వన్ చిత్రంతో నిరూపించింది. ఇందులో కీలకపాత్ర పోషించిన రుక్మిణి వసంత్.. సినిమా మొత్తం సాఫ్ట్ క్యారెక్టర్ తో ఆకట్టుకొని.. క్లైమాక్స్లో ఒక్కసారిగా విలనిజం కనబరిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. పైగా కొన్ని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టి నే డామినేట్ చేసింది అంటే.. తన నటనతో ఏ విధంగా మెప్పించిందో అర్థం చేసుకోవచ్చు.అలాంటి ఈమె ప్రస్తుతం ప్రముఖ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న డ్రాగన్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పుడు మరో క్రేజీ ఆఫర్ లభించింది .ఈ విషయాన్ని తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది. నివిన్ పౌలీ సరసన హీరోయిన్ గా ఛాన్స్ కొట్టేసి.. మాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యింది. అందులో భాగంగానే ఈమె ఆన్ సెట్ కి వెళ్లిన సందర్భంగా క్లాప్ బోర్డు పట్టుకొని ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. మొత్తానికి అయితే రుక్మిణి వసంత్ మాలీవుడ్ లోకి అడుగుపెట్టడంతో అభిమానులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే తాను ఎంతో కాలంగా అభిమానిస్తున్న మాలీవుడ్ సినీ పరిశ్రమలో అవకాశం లభించడంతో తనకు చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది అంటూ రుక్మిణి చెప్పుకొచ్చింది. ఆ ప్రపంచంలో ఒక చిన్న స్థానం సంపాదించడం తనకు ఒక ముఖ్యమైన తొలి అడుగు అని , ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కూడా ధన్యవాదాలు తెలిపింది. ఈ సినిమాలో నివిన్ పౌలీ హీరోగా నటించడమే కాకుండా తన సొంత బ్యానర్ అయిన పౌలీ జూనియర్ పిక్చర్స్ బ్యానర్ పై మార్టిన్ ప్రాక్కాట్ ఫిలిమ్స్ తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మలయాళ నటుడు అజు వర్గీస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో తమలయాల సూపర్ హిట్ కామెడీ మూవీ జయ జయ జయ జయ హే అనే చిత్రానికి సహా రచయితగా పనిచేసిన నషీద్ ఫామీ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.




# టాక్సిక్ రన్‌టైమ్ పై ఆసక్తికర ప్రచారం

ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో



'టాక్సిక్ ఒకటి. యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'టాక్సిక్' రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. గీతూమోహన్ దాస్ తన కథపై నమ్మకంతోనే ఈ నిడివితో సెన్సార్‌కు పంపారని సమాచారం. ఈ సినిమాను ప్రైమ్ బిగ్ స్క్రీన్ ఫార్మాట్ అయిన ఐమాక్స్‌లో కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. కన్నడ ఇండస్టీ నుంచి ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతోన్న రెండో సినిమా ఇది కాగా.. రెండు ఐమాక్స్ చిత్రాలను (కేజీఎఫ్ 2, టాక్సిక్) తన ఖాతాలో వేసుకున్న ఏకైక కన్నడ స్టార్‌గా యశ్ రికార్డు సృష్టించారు. త్వరలోనే దేశవ్యాప్తంగా ఐమాక్స్ బుకింగ్స్ కూడా ప్రారంభం కానున్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

--------------




# కలెక్షన్లలో కనకరాజు దూకుడు

మెగాహీరో వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ. 37 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇక వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన మొదటి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం చాలా విజయవంతంగా పాస్ అయింది. విడుదలైన నాలుగో రోజు అయిన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవ్వడం విశేషం. దీనివల్ల మొదటి వారపు రోజుల్లోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని స్పష్టమవుతోంది. ఇలాగే కలెక్షన్స్ కొనసాగితే రాబోయే రోజుల్లోనూ థియేటర్లలో ఈ చిత్రం హవా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇదిలాఉంటే, ఈ సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613